APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు


తెలుగు దినపత్రిక

10-06-2026
బుధవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 226
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్
FOLLOW:
https://epaper.expresstelugudaily.com



2

## మీనాక్షి నటరాజన్‌కు షాక్





## ఇందిరమ్మ రాజ్యం వస్తేనే..

# మహిళలకు గుర్తింపు

### వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలే..



- మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం
- అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది
- భారత్‌కు స్వాతంత్ర్యం మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుంది
- మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా?
- వారితో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది
- బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు ఇచ్చారా?
- బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదు
- సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేవరకు విశ్రమించను
- సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో

మహిళాశక్తి సభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

- స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ
- జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన సీఎం

2

ప్రాజెక్టులకు ఎక్కడ అడ్డు పడ్డానో నిరూపిస్తే..

## రాజీనామాకు సిద్ధం

- రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి చాలెంజ్
- ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- ప్రజల దృష్టిని మళ్లించేందుకే రేవంత్ రెడ్డి నాపై తప్పుడు ప్రచారం
- మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి అప్పల కుప్పగా మార్చారు

2



## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



- పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదా బైనామాల పరిష్కారానికి నిబంధనలు సవరించాం
- సాగులో ఉన్న వారికే పట్టా పుస్తకాలు ఇస్తూ, లేని వారివి రద్దు చేసే చట్టాన్ని తెచ్చాం
- రాబోయే కొద్ది రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తాం
- ప్రజా దర్బార్‌కు వచ్చిన వారు కేవలం కాంగ్రెస్ శ్రేణులు మాత్రమే కాదు
- అన్ని పార్టీలకు చెందిన పేద ప్రజలు ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో వచ్చారు
- ఈ ప్రభుత్వం మా సమస్యలు తీరుస్తుందనే అచంచల విశ్వాసం ప్రజల్లో కనిపించింది
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2



2

## హైదరాబాద్‌లో.. భారీ వర్షం

- ట్రాఫిక్ జామ్.. మునిగిపోయిన కార్లు
- హైదరాబాద్ మెట్రోలో రద్దీ
- నేడు తెలంగాణలో భారీ వర్షాలు

## ధాన్యం సేకరణలో తెలంగాణ రికార్డు



- రూ. 35,077 కోట్లు రైతుల ఖాతాల్లో జమ!
- రాష్ట్ర చరిత్రలోనే ఈ యాసంగిలోనే అత్యధికంగా సేకరణ
- రైతుల వద్ద ఉన్న ప్రతి గింజను కొన్నాం
- పదేళ్లలో బీఆర్ఎస్ రూ. 1.35 లక్షల కోట్లు ఇస్తే..
- తాము రెండేళ్లలోనే రూ. లక్ష కోట్లు ఇచ్చాం
- మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు
- కమీషన్ కింద రూ. 171 కోట్ల పంపిణీ
- దేశంలో పండే వరిలో 61 శాతం తెలంగాణలోనే ఉంది
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

## విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

Contacts
తెలంగాణ
95500 21491

# ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మహిళలకు గుర్తింపు



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మన సంస్కృతి, సంప్రదాయంలో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి మహిళాశక్తిని ప్రపంచానికి చాటిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని తెలిపారు. స్వయం సహాయక బృందాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేశారు. జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో పాల్గొని రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుందని అన్నారు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని పేర్కొన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారని, వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలని, ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనదని కొనియాడారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని పరిపాలన చేస్తున్నామని అన్నారు. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టిందని, భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకి దక్కుతుందని తెలిపారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తు చేశారు. బీజేపీ పార్టీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళలకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకూ మంత్రి పదవి ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లకు 2013లో సోనియాగాంధీ బిల్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మహిళలకు గుర్తింపు ఉంటుందని, గత ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును చెల్లించలేదని, మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. మహిళలతో పెట్టుకున్నందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందని తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. ఆడబిడ్డలు ఉచితంగా బస్సులో పక్క ఊరు వెళ్లి చదువుకుంటున్నారని, ఫ్రీ బస్సు వల్ల స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపవుట్లు తగ్గాయని తెలిపారు. అంబానీ, అదానీలకు పోటీగా పెట్రోల్ బంక్‌లు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని, హైటెక్‌సిటీ పక్కన రూ. వెయ్యి కోట్ల భూమిని మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి మహిళల చేతిలో ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలను ఏనాడైనా మహిళలు కట్టుకున్నారా? అని అడిగారు. తమ ప్రభుత్వం ఇచ్చిన చీర కట్టుకుని మహిళలు ఈ సభకు వచ్చారని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు.

## మీనాక్షి నటరాజన్‌కు షాక్

**నేషనల్ బ్యూరో:** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు గట్టి షాక్ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి ఆమె రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ వేయగా.. రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. కేసుల వివరాలను ఆమె అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచిపెట్టినందుకే ఈ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. మీనాక్షి నటరాజన్ కేసుల వివరాలను దాచిపెట్టినట్టు బీజేపీ చేసిన ఫిర్యాదు మేరకు రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్ తిరస్కరించారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు కాంగ్రెస్ నేతలు ఈసీ కార్యాలయానికి వెళ్లగా.. పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నేతలు.. పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఈసీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది.

## హైదరాబాద్ లో భారీ వర్షం



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** హైదరాబాద్ మహా నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం సాయంత్రం నగరంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. ముఖ్యంగా జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, షేక్ పేట్, హైటెక్ సిటీ, మాదాపూర్ లాంటి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం వల్ల నేషనల్ హైవేపై రోడ్లన్నీ జలమయమై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మంగళవారం సాయంత్రం ప్రారంభమైన ఈ వర్షం.. అర్ధరాత్రి అయినా తగ్గలేదు. బుధవారం ఉదయం 8 గంటల వరకు హైదరాబాద్ మహా నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం పడే అవకాశాలు ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప, బయటకు రాకూడదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ ఐటీ కారిడార్ లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఐకియా కూడలి వద్ద ఏకంగా 5 కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. 20 నిమిషాల జర్నీకి కూడా రెండు గంటల సమయం పట్టింది. ఈ నేపథ్యంలో వాహనదారులు ఇంటికి చేరుకునేందుకు చాలా ఇబ్బంది పడ్డారు. ఇక అటు కొండాపూర్‌కొత్తగూడ జంక్షన్ వద్ద రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఈ క్రమంలో ఆటోలు, కార్లు మునిగిపోయాయి. వర్షం వల్ల నేషనల్ హైవేపై రోడ్లన్నీ జలమయమై భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో చాలా మంది ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు మెట్రోలో ప్రయాణించారు. ఈ క్రమంలో మెట్రో స్టేషన్లలో రద్దీ విపరీతంగా పెరిగింది. నేడు తెలంగాణలో భారీ వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం భారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు పడుతున్నట్టు హెచ్చరించింది. రంగారెడ్డి, నల్గొండ, వరంగల్, హైదరాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో మోస్తారు వర్షాలు పడతాయని తెలిపింది.

# ధాన్యం సేకరణలో తెలంగాణ రికార్డు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత యాసంగి సీజన్ ధాన్యం సేకరణలో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి సగర్వంగా ప్రకటించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రికార్డు స్థాయిలో నిధులు విడుదల చేశామన్నారు. ఈ సీజన్‌లో ధాన్యం విక్రయించిన అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో ఏకంగా రూ. 35,077 కోట్ల భారీ మొత్తాన్ని నేరుగా జమ చేశామని వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అధికారిక మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పారదర్శకంగా, వేగవంతంగా ఈ సేకరణ ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 65.91 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రికార్డు స్థాయిలో 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని మంత్రి తెలిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం మాత్రం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని రాష్ట్రానికి ప్రాథమిక టార్గెట్ విధించిందన్నారు. కానీ, తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, కేంద్రం నిర్దేశించిన కోటా కంటే అదనంగా.. ఏకంగా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం విజయవంతంగా సేకరించిందని మంత్రి స్పష్టం చేశారు.

**మహిళా సంఘాలు, పీఏసీలకు భారీ ఊతం!**

ధాన్యం కొనుగోలు ప్రక్రియ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఐకేపీ మహిళా సంఘాలను, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పీఏసీఎస్) ఆర్థికంగా బలపరుస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ కొనుగోళ్లలో మహిళా సంఘాల పాత్రను కొనియాడుతూ.. వారి ద్వారా ఈ యాసంగిలో ఏకంగా 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. ఇందుకుగాను మహిళా సంఘాలకు కమీషన్ రూపంలో రూ. 171 కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించి అందజేశామన్నారు. మరోవైపు, గ్రామీణ పీఏసీల ద్వారా రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయించినట్లు మంత్రి వెల్లడించారు. దేశంలో పండే మొత్తం వరి పంటలో 61 శాతం వాటా ఒక్క తెలంగాణలోనే ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా గణాంకాలతో సహా వివరించారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ సీజన్‌లో కేవలం 25 లక్షల మెట్రిక్ టన్నుల వరిని మాత్రమే కొనుగోలు చేయగలిగిందని.. మొత్తంగా ఈ యాసంగి పంట సేకరణలో పక్క రాష్ట్రాలన్నీ తెలంగాణ కంటే చాలా తక్కువగా కొనుగోలు చేశాయని గుర్తు చేశారు.

**రాష్ట్ర చరిత్రలోనే సరికొత్త మైలురాయి!**

ధాన్యం సేకరణ కోసం పౌరసరఫరాల శాఖ ముందస్తుగా 20.86 కోట్ల గోనె సంచులను సిద్ధం చేయగా, అందులో 18 కోట్ల సంచులను విజయవంతంగా ఉపయోగించామన్నారు. "తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని యాసంగి సీజన్ల కంటే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ యాసంగిలోనే అత్యధికంగా ధాన్యాన్ని సేకరించి సరికొత్త మైలురాయిని అందుకున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమ పాలనలో ఎప్పుడూ ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం సేకరించలేదు. చివరకు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సైతం ఈ స్థాయిలో వరి సేకరణ జరగలేదు. గత పది సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు వివిధ రూపాల్లో రూ. 1.35 లక్షల కోట్లు ఇస్తే.. మా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండున్నరేళ్ల (30 నెలల) స్వల్ప కాలంలోనే రైతుల సంక్షేమం కోసం అక్షరాలా రూ. లక్ష కోట్ల రూపాయలను అందజేసింది. గత పాలకులు కేంద్రం ఇచ్చిన టార్గెట్ కంటే ఎప్పుడూ తక్కువ ధాన్యమే కొనుగోలు చేసేవారు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

**కేంద్రం కోటా తగ్గించినా.. ఎంఎస్‌పీ ఇస్తున్నాం!**

తెలంగాణ నుండి ప్రతి ఏటా సేకరించే వరి కోటాను కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో అధునాతన పద్ధతుల ద్వారా వరి ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంటే.. కేంద్రం మాత్రం కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు కోటాను తగ్గించినప్పటికీ, రాష్ట్ర ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం రైతులపై భారం పడకుండా.. కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకారమే ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తోందని మంత్రి స్పష్టం చేశారు. రైతుల వద్ద ఉన్న చివరి వరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యతను తమ ప్రభుత్వం విజయవంతంగా నెరవేర్చిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పారిశ్రామికవేత్తలు కేవలం పెట్టుబడిదారులు కాదని.. రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026 ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తు కోసం ఎదురుచూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్‌టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్‌టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో.. భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి అనేది కేవలం భూమి, మూలధనంపైనే కాకుండా.. మేధో సంపత్తి, నాలెడ్జ్ ఎకానమీ ఆధారంగానే సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను స్కిల్ క్యాపిటల్‌గా మార్చాలనే సంకల్పంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను తీసుకొచ్చి... ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతోనే ముందుకెళ్తున్నామన్నారు. సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు రవికుమార్, కేకే మహేశ్వరి, శ్రీనివాస్ గరిమెల్లా, భాస్కర్ రెడ్డి, అనిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)పై విజయవంతం చేయాలని తెలిపారు. తెలంగాణలో ఈనెల 25వ తేది నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, దీనిని ప్రశాంతంగా నిర్వహించేందుకే మంగళవారం నాడు ప్రధాన ఎన్నికల కార్యాలయం (బీఆర్కేభవన్)లో రాష్ట్రంలోని అన్ని ఎన్నికల నమోదు అధికారులకు (ఈఆర్ఓ) ఈ శిక్షణ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పని చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటర్ లిస్టులో చేర్చాలని, అదేవిధంగా అనర్హులైన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంతో ఎన్నికల అధికారుల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రత్యేకించి ఎస్ఐఆర్‌కు సంబంధించిన బీఎల్ఓ యాప్‌తో కూడిన ఈసీఐనెట్ అప్లికేషన్‌పై వారికి సమగ్ర అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్ అమలు సమయంలో ఎదురయ్యే సవాళ్లపై పకడ్బందీ కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సిఇఒ సూచించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ ప్రక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు. పీఎంఐటీ డి. చిరంజీవి, ఈసీఐనెట్ బీఎల్ఓ యాప్‌కు సంబంధించిన సాంకేతిక శిక్షణను అందించారు. ఇందులో ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పూరించడం, ఓటర్ల మ్యాపింగ్, సేకరించలేని ఎన్యూమరేషన్ ఫారమ్‌ల వర్గీకరణ, అలాగే ఇతర అనుబంధ కార్యకలాపాల విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి ఎం. సత్యవాణి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఏసీ) ఎఎస్. చారిలతో పాటు నోడల్ అధికారులు, సంబంధిత సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ ఇంట్లో ఏసీబీ సోదాలు

### భారీగా ఆస్తులు గుర్తింపు



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ నివాసంలో జరిపిన సోదాల్లో ఏసీబీ అధికారులు భారీగా ఆస్తులు గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో మోహన్ నాయక్ ఇంటితో పాటు 15 ప్రాంతాల్లోని ఆయన బంధువుల నివాసాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. మోహన్ నాయక్ ఆస్తుల విలువ రూ.18 కోట్లకుపైనే ఉంటుందని తెలిపారు. నిజామాబాద్ జిల్లా ముల్లంగిలో 19.38 ఎకరాల వ్యవసాయ భూమి, కొంపల్లిలో ఫ్లాట్లు, గచ్చిబౌలిలో రూ.7.40 కోట్ల విలువైన 4 ఫ్లాట్లు, మియాపూర్‌లో రూ.2.50 కోట్లు విలువ చేసే విల్లా, కూకట్‌పల్లిలో రూ.62.14లక్షలు విలువైన ఇల్లు, బ్యాంకు ఖాతాలో 1.44 కోట్లు నగదు, ఇంట్లో రెండున్నర కిలోల బంగారం.. 6 కిలోల వెండి ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్


**విశ్వంభర, నేలకొండపల్లి :** రైతులు, స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లి మండలం చెరువు మాదారం డిసిసిబి బ్రాంచిని చెరువు మాదారం గ్రామంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సీపీ సునీల్ దత్‌లతో కలిసి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేట్, కమర్షియల్ బ్యాంకులతో పోటీగా డీసీసీబీ శాఖలు ఆధునిక ఆర్థిక సేవలు అందిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఖమ్మం డీసీసీబీ రూ. 5 కోట్ల లాభాలను ఆర్జించిందని కలెక్టర్ పేర్కొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' విజయవంతం కావడమే నిదర్శనమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూలై 12 నాటికి పూర్తి కాబోతోందని వెల్లడించారు.పాలేరు నియోజకవర్గాన్ని 14 క్లస్టర్లుగా వర్గీకరించి, గత 25 నుంచి 30 రోజులుగా 'ప్రజల వద్దకే ప్రభుత్వం' అనే నినాదంతో ప్రజా దర్బార్ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. సోమవారంతో ఆఖరి విభాగం పూర్తయిందని, ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు 25వేల మంది ప్రజలను తాను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలను స్వయంగా కళ్లారా చూసి, చెవులారా విన్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజా దర్బార్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి మొత్తం 24వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 11,000 అర్జీలు, ఆసరా పింఛన్ల కోసం 5,200 అర్జీలు అందినట్లు వివరించారు. అలాగే గృహజ్యోతి పథకం దరఖాస్తులతో పాటు అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీరు వంటి స్థానిక సమస్యలపై కూడా ప్రజలు పెద్ద ఎత్తున వినతులు సమర్పించారని చెప్పారు. గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చే ముందు సాదాబైనామాల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత చట్టంలో చేర్చకుండా రైతులను గాలికి వదిలేసిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9,26,000 సాదాబైనామా దరఖాస్తుల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రి మండలి నిబంధనలను సవరించిందని తెలిపారు. గతంలో భూమి అమ్మిన వారి సమ్మతి కూడా కావాలనే నిబంధన ఉండేదని, కానీ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అమ్మిన వారి సమ్మతి అవసరం లేకుండా నిబంధనలు మార్చామన్నారు. ఇప్పటికే ఐదున్నర లక్షల దరఖాస్తులను గుర్తించి నోటీసులు ఇచ్చామని, మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తవుతుందని, చట్టప్రకారం 30 రోజుల నోటీసు గడువు తర్వాత అర్హులైన అన్ని సాదాబైనామాలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. తరతరాలుగా భూమి సాగులో ఉన్నా పట్టా పుస్తకాలు రావట్లేదని ఆవేదన చెందుతున్న రైతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం (కాకరవాయి) గ్రామంలో ఇప్పటికే ఈ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. క్షేత్ర స్థాయిలో సాగులో ఉన్న వారికే పట్టా పుస్తకాలు ఇస్తూ, లేని వారివి రద్దు చేసే చట్టాన్ని తెచ్చామని, ప్రజా దర్బార్‌లో వచ్చిన 4,300 భూ సమస్యల దరఖాస్తుల్లో దాదాపు 2,300 అప్లికేషన్లను ప్రత్యేక కార్యాచరణ ద్వారా త్వరలోనే పరిష్కరించబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ అవసరాల కోసం కొంత భూమి సేకరిస్తే ఆ సర్వే నెంబర్ మొత్తం నిషేధిత జాబితాలో పెట్టే పాత విధానాన్ని సవరించి, పట్టా భూములను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశామన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి అధికారుల యంత్రాంగాన్ని విభజించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కనీసం 45 రోజుల సమయం పడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి దరఖాస్తులను విడతలవారీగా అందజేస్తామని, అలాగే ఇళ్ల స్థలాల కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించామని, ఎక్కడైతే నివాసానికి యోగ్యమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటిని సేకరించి రాబోయే కొద్ది రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, పదేళ్లు దొరపాలన సాగించిన మాజీ మంత్రులు రాజకీయ దురుద్దేశంతో, స్వలాభం కోసం ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, వారి మాటల్లో ఎలాంటి నిజం లేదని మంత్రి కొట్టిపారేశారు. ప్రతిపక్షాలు చేసే విమర్శల్లో ప్రజలకు ఉపయోగపడే న్యాయమైన అంశాలు ఉంటే పంతాలకు పోకుండా సానుకూలంగా తీసుకుని తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన వారు కేవలం కాంగ్రెస్ శ్రేణులు మాత్రమే కాదని, అన్ని పార్టీలకు చెందిన పేద ప్రజలు ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో వచ్చారని మంత్రి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఈ ప్రభుత్వం ఖచ్చితంగా మా సమస్యలు తీరుస్తుందనే అచంచల విశ్వాసం ప్రజల్లో కనిపించిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికలు.. ఏవైనా సరే ఓటరు స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# పీర్ల పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించాలి

### మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అజారుద్దీన్‌కి వినతి పత్రం



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** హైదరాబాద్ లోనే తెలంగాణ స్టేట్ వక్ఫ్ కార్యాలయం సమీపంలో జరిగిన ఒక కార్యక్రమం ముందు రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ మంత్రివర్యులు శ్రీ మమ్మద్ అజారుద్దీన్కి పీర్ల పండుగను రాష్ట్ర పండుగ గుర్తించాలని కోరుతూ పీర్ల పండగ (మొహరం) నిర్వాహకుల సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో "అసైదు సే భారతి కాళ్ల గజ్జల గమ్మతి "అనే పీర్ల పండగ బానిలోని పాట తెలంగాణ ఉద్యమంలో ఒక చైతన్య కెరటంగా పని చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలోని మాభూమి సినిమాలో కూడా పీర్ల పండుగ ప్రాముఖ్యతను ప్రజల జీవితాల్లో అది భాగమైన విధానాన్ని చూపారని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మతో సమానంగా పీర్ల పండుగను ప్రజలు జరుపుకుంటారని వారు తెలిపారు. మత సామరస్యానికి, సహోదరత్వానికి, అమరత్వ స్ఫూర్తికి , పోరాట వారసత్వానికి పీర్ల పండుగ పూర్తి దాయకమన్నారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయంలో భాగమైన పీర్ల పండుగను తెలంగాణ రాష్ట్ర వచ్చిన తర్వాత కెసిఆర్ నాయకత్వంలోని టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సిగ్గు చేటని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ వారసత్వాన్ని నిర్లక్ష్యం చేసిన కారణంగానే తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్‌ను ఓడించారని వారు గుర్తు చేశారు. తెలంగాణలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండున్నరేండ్ల కాలంలో పీర్ల పండుగను పట్టించుకోకపోవడం విషాదకరమని అన్నారు. ప్రజా పాలన అంటే ప్రజల సంస్కృతిని గౌరవించాలని కావున పీర్ల పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగ గుర్తించాలని వారు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ మహమ్మద్ అజారుద్దీన్ గారిని కోరారు. పీర్ల మాన్యాలను భూఆక్రమణదారుల నుండి విడిపించాలని డిమాండ్ చేశారు. పీర్ల చావిడీలకు మరమ్మత్తు నిర్వహణ కొరకు ప్రతి సంవత్సరం 20 వేల రూపాయలు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పీర్ల పండుగ, (మొహరం) నిర్వాహకుల సంఘం రాష్ట్ర జి. ఘటన, రాష్ట్ర కోకన్వీనర్ ఎఫ్ఎం ఖలీల్, రాష్ట్ర నాయకులు మహ్మద్ ముజీబ్, తెలుగు వీరన్న, ఎండి వహీద్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఓజీ గంజాయి స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు.. జూనియర్ ఆర్టిస్ట్ అరెస్టు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** అంతర్జాతీయ ఓజీ గంజాయి స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టయింది. ఈగల్ ఫోర్స్, కస్టమ్స్, ఎన్సీబీ అధికారులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి.. ఈ ముఠా బ్యాంకాక్ భారత్ మార్గంలో గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి నూరికళను అరెస్టు చేశారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఆమె నుంచి 2.15 కిలోల ఓజీ వీడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో కేరళకు చెందిన చల్లిల్ పుతన్ పురాయిల్ నఫీద్ కీలక సూత్రధారి అని గుర్తించారు. మహిళలకు డబ్బు ఆశ చూపించి గంజాయి స్మగ్లింగ్‌లోకి దించుతున్నారని, విదేశీ ట్రిప్పుల పేరుతో మోసం చేసి వారిని ఈ ముఠా డ్రగ్స్ రవాణాకు వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగానే నూరికళను మూడు సార్లు బ్యాంకాక్ పంపినట్లు విచారణలో వెల్లడైంది. ఒక్కో ట్రిప్‌నకు రూ.10 వేల నుంచి రూ.20వేల వరకు స్మగ్లర్లు చెల్లించారని అధికారులు తెలిపారు. ఆమె లగేజీలో గంజాయి ప్యాకెట్లు పెట్టి భారత్‌కు పంపారన్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లో ఈ ముఠా కార్యకలాపాలు కొనసాగిస్తోందని గుర్తించామన్నారు. నూరికళ సహచరురాలు గంగాభవానీ సైతం ఇదే కేసులో గతంలో అరెస్టు కాగా.. గౌరి అనే మరో మహిళను చెన్నై విమానాశ్రయంలో పట్టుకున్నట్లు ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. జూనియర్ ఆర్టిస్టులు, గృహసహాయకులను పావులుగా చేసుకొని ఈ అంతర్జాతీయ డ్రగ్ సిండికేట్ తన కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు గుర్తించారు. విదేశీ హ్యాండ్లర్లు, అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌లపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో కీలక నిందితులైన అలెక్స్, రాజు బిశ్వాస్‌తో పాటు కీలక నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

# సంగారెడ్డి జిల్లా అభివృద్ధిపై మంత్రుల సమగ్ర సమీక్ష



- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అధికారులకు దిశానిర్దేశం

**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ,రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి,జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి ,లు మంగళవారం జిల్లా అధికారులతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో చేపట్టిన ఈ సమావేశంలో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, మున్సిపల్,వ్యవసాయం,మిషన్ భగీరథ,సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, విద్యుత్ సరఫరా,రోడ్లు,పంచాయతీ రాజ్,కార్మిక శాఖల పనితీరుపై మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని, క్షేత్రస్థాయిలో పనులు పారదర్శకంగా జరగాలని మంత్రులు అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని,మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్,ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి,సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,ఎస్పీ పరితోసష్ పంకజ్,అదనపు కలెక్టర్ పాండుతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# కాపేడు స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ ట్రైనింగ్,సర్టిఫికెట్ల పంపిణీ





**వాజేడు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల పరిధిలోని అయ్యవారిపేట గ్రామపంచాయతీలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ పొందిన 23 మంది విద్యార్థి మహిళలకు మంగళవారం రోజున సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అయ్యవారిపేట సర్పంచ్ మడకం బెనిని, చింతూరు సర్పంచ్ తెల్లం సుమాంజలి హాజరై మహిళకు అభినందనలు తెలియజేసి వారి చేతుల మీదుగా సర్టిఫికెట్లను పొందారు. కాఫెడు సంస్థ డైరెక్టర్ బ్రదర్ లూర్దు రాజు మహిళలను అభినందించి వారి భవిష్యత్తు విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రస్తుత డిజిటల్ యుగంలో కంప్యూటర్ విద్య ప్రతి మహిళలకు కుట్టు మిషన్ ట్రైనింగ్ అత్యంత అవసరమని,ఈ ఉచిత శిక్షణ సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వ పథకాలు పొందవచ్చు అని అవగాహన కల్పించారు. అవకాశాలు పొందడంతో పాటు ఉన్నత స్థాయిలో కూడా ఎదగాలని కోరారు.గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాలలో యువతి, యువకులకు ఎక్కువగా నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా వారిని ఆధునిక ప్రపంచంతో అనుసంధానం చేయడమే కాఫెడు స్వచ్ఛంద సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బ్రదర్ జయరాజ్, కాఫెడు కోఆర్డినేటర్లు జి.కామేష్, సంస్థ సిబ్బంది ఉష,రమాదేవి,పద్మ, ఇందిరా, స్వరూప,సుజల, భాస్కర్, నరేష్, ప్రశాంత్,ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి,ఉపాధి అవకాశాల కల్పన కోసం కాఫెడు సంస్థ భవిష్యత్తులో కూడా ఇటువంటి ఉచిత శిక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తుందని సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలియజేశారు.

# మోమిన్‌పేట్‌లో విత్తనాలు,ఎరువుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు



- నాణ్యత,నిల్వలు,రైతులకు అందుబాటుపై అధికారుల ప్రత్యేక దృష్టి

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్న నేపథ్యంలో మంగళవారం నాడు మోమిన్ పేట్ మండలంలో టాస్క్‌ఫోర్స్ బృందం విత్తనాలు మరియు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసింది .ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న విత్తనాల నాణ్యత, నిల్వలు (స్టాక్), ఎరువుల లభ్యత, విక్రయ రికార్డులు, లైసెన్సుల నిర్వహణ తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. రైతులకు నాసిరకం విత్తనాలు లేదా ఎరువులు విక్రయించకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని వ్యాపారులకు సూచించారు.వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని, ఏవైనా అక్రమాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ తనిఖీల్లో మండల తహసీల్దార్ రవీందర్,మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ రెడ్డి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ భరత్ భూషణ్,తో పాటు సంబంధిత శాఖల అధికారులు జీపీఓ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం


## ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ పట్టణంలో ఇందిర మహిళా శక్తి పథకం ఆధ్వర్యంలో నారాయణఖేడ్ మండల మహిళా సమైక్య సంఘం, కంగ్టి మండల జననీ మహిళా మండల సమాఖ్యల ఆధ్వర్యంలో మహిళా శక్తి మహాసభకు బయలుదేరిన మహిళల కోసం ఏర్పాటు చేసిన బస్సులను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు.హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మహిళా శక్తి మహాసభకు నారాయణఖేడ్, కాంగ్టి మండలాల నుంచి సుమారు 100 మంది మహిళా ప్రతినిధులు ఈ బస్సుల్లో పాల్గొనడానికి బయలుదేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలను స్వయం సమృద్ధులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా 553 మహిళా శక్తి బస్సులను టీజీఎస్ఆర్టీసీకి అప్పగించే కార్యక్రమం మహిళా సాధికారతలో చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మహిళా సంఘాలకు మరిన్ని రాయితీలు,ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు,అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



# ఎంగేజ్మెంట్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

## ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ సెట్కర్



**కంగ్టి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలం పరిధిలోని నాగూర్(బి) గ్రామానికి చెందిన సంఘప్ప కూతురి నిశ్చితార్థం వేడుకకు మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి,నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ సెట్కర్,లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి తోపాటు సర్పంచ్ రాజు పటేల్,సంజీవ్ పటేల్,పవన్ పటేల్,రాజు పటేల్,రాజప్ప,బస్వరాజ్ పటేల్, మారుతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తడ్కల్ జొన్నల కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ధర్నా



## కంగ్టి పిట్లం రోడ్డుపై నిలిచిన వాహనాలు

**కంగ్టి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలో మంగళవారం జొన్నల కొనుగోలు కేంద్రం వద్ద రైతులు పిట్లం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు గోనే సంచుల,లారీల కొరతతో,అకాల వర్షానికి జొన్నలు తడిసి మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెంది ధర్నా నిర్వహించి,ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలు చేశారు.లారీల కొరత గోనే సంచుల కొరతను తీర్చాలని రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వానికి,ప్రభుత్వ అధికారులకు, డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతన్నలను కంగ్టి ఎస్ఐ దుర్గారెడ్డి,మాట్లాడి ప్రధాన రహదారిపై నిలిచిన వాహనాలను పునరుద్ధరించారు.ఈ కార్యక్రమంలో తడ్కల్ చుట్టూ పక్కల గ్రామాల రైతులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

# ఖేడ్‌లో భారీ వర్షం

- రైతుల ముఖాల్లో ఆనందం
- ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాల కొనుగోలుకు రైతుల రద్దీ

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నారాయణఖేడ్ పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మృగశిర కార్తె ప్రారంభమైన నేపథ్యంలో కురిసిన ఈ వర్షంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.కొన్ని రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు వర్షం కురవడంతో వ్యవసాయ పనులపై దృష్టి సారించారు. వర్షం అనంతరం ఫర్టిలైజర్ దుకాణాలు, విత్తనాల విక్రయ కేంద్రాల వద్ద రైతులు పెద్ద సంఖ్యలో కనిపించారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.ఇదే విధంగా మరిన్ని వర్షాలు కురిస్తే విత్తనాల విత్తకం వేగవంతమవుతుందని, సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. వర్షం కురవడంతో వ్యవసాయ రంగంలో ఆశలు చిగురించాయని పలువురు రైతులు తెలిపారు.





Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com